క్లుప్తంగా

గణిత ప్రతిభా పరీక్ష రేపు

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3న మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు సిక్కోలు గణిత ఉపాధ్యాయుల సంఘ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి గరిష్ఠంగా ఆరుగురికి అవకాశం ఉంటుందన్నారు. ఆ రోజు ఉదయం 8.30 గంటలకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీఐగా తిరుపతిరావు



జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి సీఐగా టి.వి.తిరుపతిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని చినమేరంగి, జియ్యమ్మవలస, గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. మద్యం బెల్టుషాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

గరుగుబిల్లి: పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏవో ఆర్.విజయభారతి సూచించారు. ఇదే విషయమై ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, పెసర, వేరుశనగ పంటలు పండించే రైతులంతా ఈ నెల 15వ తేదీలోగా ఆయా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. బీమా చెల్లించడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట నష్టపోతే నష్టపరిహారం పొందేందుకు వీలుంటుందన్నారు.

కరుణించిన వరుణుడు

- చిగురించిన రైతు ఆశలు



పాలకొండ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా వరి పంట చివరి దశకు చేరుకుంది. కీలక సమయంలో శివారు భూములకు సాగునీరు అందక వరి భూములు బీటలు దేరడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో తమ ఆశలు చిగురించాయని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సూచనలిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

కొమరాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని విక్రంపురం, కోన తదితర గ్రామాల్లో మలేరియా జ్వరం లక్షణాలు, నివారణ చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విక్రంపురంలో ఇటీవల ఓ వ్యక్తికి మలేరియా సోకగా, ఆ వ్యక్తికి పూర్తిస్థాయిలో చికిత్స అందించి నయం చేయడం జరిగిందన్నారు. మురుగునీటి నిల్వలు ఉన్నచోట దోమలు విపరీతంగా పెరిగి, తద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా చాలా వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని ఎస్‌ఐ ఎం.రాజేష్ అన్నారు. అలాగే సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం లేని వారు, మద్యం సేవించి, అతిజోరుగా వాహనాలు నడపడం, హెచ్చరికలు పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. మైనర్లకు వాహనలు ఇవ్వరాదని కోరారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లను వారి ఇంటి వద్దే పంపిణీ చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు ఆదేశించారు. శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిత పింఛన్ల యాప్ మొరాయించడంతో కొంత జాప్యం జరిగిందని, తరువాత పంపిణీ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక శోభ..

- నేటి నుంచి ప్రత్యేక పూజలు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



పాలకొండ రూరల్: భక్తులచే పూజలు అందుకుంటున్న సనారీ విశ్వేశ్వరుడు



పాలకొండ రూరల్: తంపటాపల్లి ఆలయంలో ద్వితీయ లింగ దర్శనం

పాలకొండ రూరల్: పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకుని పాలకొండ పట్టణ, మండలంలో గల శైవక్షేత్రాలు ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యాయి. పవిత్ర నాగావళీ తీరాన్ని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. కాశీ విశ్వేశ్వర, ఉమా రామలింగేశ్వర, రాజలింగేశ్వర, భీమ లింగేశ్వర, కోటీశ్వర, సదాశివ, సనారీ విశ్వనాథ, అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాథుడు, మృత్యుంజయ మరకత లింగేశ్వర, తదితర ఆలయాలకు కార్తీక శోభ సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అర్చకులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

తంపటాపల్లిలో..

మండలంలోని తంపటాపల్లిలో గ్రామస్తుల సంకల్ప సహకారంతో వెలసిన ఉమామహేశ్వర, వీరభద్రస్వాముల ఆలయానికి ఓ విశిష్టత ఉంది. ఇక్కడ ఒకే పానమట్టంపై ద్వితీయ లింగాలను దర్శించుకోవచ్చు. కరీంనగర్ జిల్లా కాళేశ్వరంలో ఈ తరహా ద్వితీయ లింగదర్శనం ఉందని ఆలయ నిర్వాహకులు కొమ్మూరు కుటుంబీకులు తెలిపారు. అక్కడ నమూనా ప్రకారం ఈ ప్రాంతంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ రెండు శివలింగాలకు అభిముఖంగా ఆలయంలో నందీశ్వరునితో పాటు భృంగీశ్వరుని పేరిట రెండు నందులు దర్శనమిస్తున్నాయి. ఆలయ ధ్వజస్తంభం వద్ద మరో భారీ నందీశ్వరుడు కొలువుదీరి భక్తుల పూజలను అందుకుంటున్నాడు. ప్రతి నిత్యం ఆలయంలో గల శివలింగాలపై సూర్యకిరణాలు పడుతుండడం విశేషం.

అపూర్వం సనారీవారి దర్శనం...

అదే తరహాలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పాలకొండ పట్టణం కోమటిపేటలో స్వయంభువుగా వెలసిన అన్నపూర్ణా సహిత సనారీ విశ్వనాథ అవదూత ఆలయం మరో ప్రత్యేకం. పర్వదినాల్లో ఇక్కడి మహిమలు భక్తులకు స్వీయ అనుభూతిని కల్పిస్తాయని ప్రతీతి. అలాగే అన్నవరం గ్రామంలో గల ఉమారామలింగేశ్వర ఆలయం వందల సంవత్సరాల చరిత్రకు నిదర్శనంగా నిలుస్తోంది. వీటితో పాటు మండలంలోని కోటిపల్లి కొండలపై ఆహ్లాదకర వాతావరణంలో వెలిసిన మహాశివుడు దర్శనం అద్భుతంగా పేర్కొనవచ్చు.

వీరఘట్టం: శివపూజకు సిద్ధమైన ఉమాచంద్ర మౌళీశ్వర ఆలయం



శివ పూజకు సిద్ధం..



వీరఘట్టం: కుంబిడిలో వెలసిన కుంభేశ్వరుడు

వీరఘట్టం: కార్తీకం ఎంతో పవిత్ర మాసం. శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కానుండడంతో శివాలయాలకు భక్తుల తాకిడి పెరగనుంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేశారు. మండలం కేంద్రంలోని ఉమా సోమేశ్వరస్వామి దేవాలయం, ఉమా చంద్రమౌళీశ్వర ఆలయాలు.. కుంబిడి–ఇచ్ఛాపురంలోని కుంభేశ్వరస్వామి ఆలయాలతో పాటు మండలంలోని నడుకూరు, కంబర, తలవరం, నడిమికెల్ల, బిటివాడ, దశుమంతపురం, అడారు, విక్రమపురం, కిమ్మి, వండవ, తదితర గ్రామాల్లో వెలసిన శైవక్షేత్రాలు అన్ని హంగులతో ముస్తాబయ్యాయి. మేజర్ పంచాయతీలోని ఉమా చంద్ర మౌళీశ్వరాలయం, ఉమాసోమేశ్వర ఆలయాల్లో ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి నుంచి రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు.

ముస్తాబైన శివాలయాలు



గొట్టివలసలో ముస్తాబైన శివాలయం

గరుగుబిల్లి: పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకుని, పూజలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. శనివారం నుంచి పూజలు ప్రారంభం కానుండడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని రావుపల్లిలోని ఉమారామలింగేశ్వరాలయం, శివ్వాంలోని రామలింగేశ్వరాలయం, పెద్దూరులోని సాంబశివుని ఆలయం, గొట్టివలసలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయం, గరుగుబిల్లి, రావివలస, ఉల్లిబద్ర, చిన గుడబ తదితర గ్రామాల్లోని శైవక్షేత్రాలను విద్యుత్ అలంకరణలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి రోహిత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, తదితరులు

కొమరాడ: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) విద్యార్థి సీహెచ్ రోహిత్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 3, 4వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే పోటీల్లో సదరు విద్యార్థి పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ఆ విద్యార్థిని పాఠశాల సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా బాగా రాణించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ కమల్‌హాసన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పని పడిగాపులు..



దిమ్మిడిజోలలో రెస్ట్‌షెడ్‌లో సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న పింఛన్‌దారులు

భామిని: మండలంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల కోసం శుక్రవారం పడిగాపులు కాశారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలోనూ ఈ అవస్థలు కొనసాగాయి. సర్వర్లు పని చేయకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రానికి సర్వర్ పని చేయడంతో పింఛన్‌దారులకు కాస్త ఊరట లభించింది.

ఉచిత గ్యాస్ పేరుతో మోసం..

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వీరఘట్టం: ఉచిత గ్యాస్ పథకం పేరుతో కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండువలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు ప్రతి ఇంటికీ ఇస్తామన్న మూడు సిలిండర్లను డిసెంబర్‌లోగా ఇవ్వాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు.వెంటనే ప్రభుత్వ స్పందించి ధరలను అదుపు చేయడంతో పాటు ఈ ఏడాదికి సంబంధించి మరో రెండు సిలిండర్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, తదితరులు

జియ్యమ్మవలస: నాటిక పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి మండలంలోని చినమేరంగిలో ఉన్న తన స్వగృహంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న సత్యకైలాష్ పాఠశాలలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ద్వితీయ నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు నాటక పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో వాన నారాయణరావు, మరడాన కిశోర్, రౌతు విజయ్‌కుమార్, అజయ్‌కుమార్, బలగ వెంకటరమణ, రాయిపల్లి మహేష్, దాసరి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో తీరుపై పలువురు నిరసన

గరుగుబిల్లి: ఎంపీడీవో పైడితల్లి తీరుపై పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండలంలోని బురద వెంకటాపురం గ్రామంలో 34 మంది, ఉద్దవోలులో 18 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు నోటీసులు జారీ చేసి వారి పింఛన్లు నిలుపుదల చేశారు. అయితే ఆ తర్వాత బీవీపురం నుంచి మరోవర్గం 39 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని, ఉద్దవోలు నుంచి 15 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై నోటీసులు కూడా జారీ చేయకుండా ఎంపీడీవో కార్యాలయంలోనే విచారణ నిర్వహించి, సక్రమంగా ఉన్నాయని పింఛన్లను లబ్ధిదారులకు అందజేయాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. ఇలా ఒక్కో సమయంలో ఒక్కో రకంగా ఎంపీడీవో తీరు కనబరచడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదునే పరిగణలోకి తీసుకుని, కొత్తగా ఇచ్చిన ఫిర్యాదులను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారినట్లు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తే వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉందంటున్నారు.

భూ రికార్డులు సరిచేయండి

జియ్యమ్మవలస: భూ రికార్డులు సరిచేయాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని తురకనాయుడువలసకు చెందిన రైతులు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి, తహసీల్దారు పకీరుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో రీసర్వే జరిగినా 1బిలు రావడం లేదని, ఇదే విషయంపై ఇటీవల జరిగిన గ్రామ సభల్లో అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, 1బిలు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.నాగమణి, రైతులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైబిల్ గ్రంథానుసారం నడుచుకోవాలి



మరియమాత విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న భక్తులు

గుమ్మలక్ష్మీపురం: బైబిల్ గ్రంథానుసారం భక్తులు నడుచుకోవాలని ఫాదర్ డి.సి.రాజు సూచించారు. మండలంలోని పి.లేవిడి గ్రామ దగ్గరలోని దయగల మాత పుణ్యక్షేత్రంలో పరిశుద్ధ, పూజిత చివరి వార వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బైబిల్ గ్రంథంలోని కొన్ని ముఖ్య వాక్యాలను చదివి, వాటి సారాంశాన్ని మత విశ్వాసులకు వివరించారు. లోకరక్షకుడు ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన మరియమాతను ఆశ్రయిస్తే దేవుని దీవెనలు కలుగుతాయన్నారు. యేసుప్రభువు చిందించిన రక్తం ద్వారా సర్వమానవాళి పాపాలు క్షమించబడ్డాయన్నారు. ఎదుటి వారికి మన వల్ల అపాయం జరగకుండా జీవించాలని ఆ దేవుడు తెలిపారన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రక్తహీనత నివారణే లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2ను ఆయన శుక్రవారం సందర్శించి, అక్కడి రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని, అలాగే లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ



ధాన్యం కొనుగోలుపై శిక్షణ అందిస్తున్న వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి

పాలకొండ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని కొండాపురం రైతుసేవా కేంద్రంలో మండల పరిధిలోని వీఏఏలు, టెక్నికల్ అసిస్టెంట్లకు వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి ధాన్యం సేకరణలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతుల సమక్షంలోనే ధాన్యం నాణ్యతను పరిశీలించాలన్నారు.

గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి..

- ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: ఉచిత గ్యాస్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఆయన దీపం -2 పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందక సత్యనారాయణ, టీడీపీ నాయకులు నిమ్మక పాండురంగ, పాదిలాపు కృష్ణమూర్తినాయుడు, జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్, బళ్ల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయ ఆవరణలో దీపం–2 పథకాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ప్రారంభించి, పలువురికి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు, జీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ కృష్ణప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళులు..



పాలకొండ రూరల్: రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగధనుడని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాములు చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరరావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: అమరజీవి పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగ ఫలితమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య కొనియాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం పురస్కరించుకుని, రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించి, పటేల్ చిత్రపటాలు పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు కల్పన, స్వరూప, తులసి, శాంత, అశోక్, సింహాచలం, హరికృష్ణ, సత్య, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: రన్ ఫర్ యూనిటీ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆందోళన తప్పదు..

సీతంపేట: సలబంపాడు – డొంబంగివలస గ్రామాల మధ్య రహదారి నిర్మించకపోతే ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖ వద్ద ఆందోళన కార్యక్రమంలో భాగంగా వంట – వార్పు కార్య క్రమం నిర్వహిస్తామని సీపీఎం నాయకులు ఎం. తిరుపతిరావు, ఎ. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నెండేళ్ల కిందట నిర్మించిన రహదారి పూర్తిగా పాడైందని, మరమ్మతులు చేపట్టాలన్నారు.

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



ప్రజలందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ సూచించారు. మండలంలోని కొండాపురంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, పలువురు రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయనతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్‌ఎం కుమారి, సిబ్బంది పాల్గొన్నారు. – పాలకొండ

వైభవంగా లక్ష్మీ పూజలు ..



నరక చతుర్దశిని పురస్కరించుకుని గురువారం స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానంలో సామూహిక ధనలక్ష్మీ పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ, వేమకోటి మనీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. – పాలకొండ రూరల్

సన్మానం ..



మండలంలోని నేరడి–బికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత సిరిగంటి ధర్మారావు దంపతులను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. గురువారం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. పీఆర్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – భామిని